తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

నయాపైసా ఇవ్వనందుకే బల్లలు చరిచారా?

- బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?
- ఏపీని చూసి బుద్ధితెచ్చుకోవాలి
- నిధులు తేనందుకు బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి రూపాయి నిధులు ఇవ్వనందుకే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బల్లలు చరిచారా? అని బీజేపీ రాష్ట్ర ఎంపీలను బీఆర్‌ఎస్ నేత, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. బడ్జెట్ ప్రసంగం జరిగేటప్పుడు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర ఎంపీలు బల్లలు చరిచారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు రూపాయి ఇవ్వకపోయినా డ్రీమ్ బడ్జెట్ అని కిషన్‌రెడ్డి అభివర్ణించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌ను చూసి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బుద్ధి తెచ్చుకోవాలని చురకలంటించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఢిల్లీలో ఏం చేస్తున్నారు? అని భగ్గుమన్నారు. నయాపైసా నిధులు తేనందుకు బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదనడానికి కేంద్ర బడ్జెట్‌ను చూస్తేనే అర్థమవుతుందని, నిరుడు కూడా రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా నిరాశపర్చారని మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్లు అనేక కార్యక్రమాలు చేపట్టి నిధులు అడిగినా కేంద్రం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుండి ఏంసాధించారని ప్రశ్నించా రు. ఈ బడ్జెట్‌లో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సైనిక్ స్కూల్, నవోదయ స్కూల్, వరంగల్ ఎయిర్‌పోర్ట్ ప్రస్తావనే లేదని మండిపడ్డారు.

పసుపు బోర్డుకు నిధులేవీ అర్వింద్?

కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు రూపాయి నిధులు ఎందుకు కేటాయించలేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి తెలంగాణకు నయాపైనా తేలేకపోయారని, తెలంగాణలో మాత్రం బీజేపీ జెండా పాతుతామని బీరాలు పలుకుతున్నారని మండిపడ్డారు. నయా పైసా తీసుకురానందుకు ప్రజలు మీకు ఓట్లు వేయాలా? అని నిలదీశారు. తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలు అంటే బీజేపీకి చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు.

లోక్‌సభకు 903 కోట్లు.. రాజ్యసభకు 413 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్‌లో లోక్‌సభకు రూ.903 కోట్లు, రాజ్యసభకు 413 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. లోక్‌సభకు కేటాయించిన నిధుల్లో 558.81 కోట్లను లోక్‌సభ సచివాలయానికి, 338.79 కోట్లు సభ్యుల కోసం ఇచ్చారు. ఇందులో సన్‌సద్ టీవీకి కేటాయించిన నిధులూ ఉన్నాయి. రాజ్యసభకు ప్రకటించిన 413 కోట్లలో 2.52 కోట్లు చైర్మన్, డిప్యూటీ చైర్మన్ల అలవెన్స్‌లు, జీతాల కోసం కేటాయించారు. వేరుగా కేటాయించిన రూ.3 కోట్లను రాజ్యసభ విపక్ష నేత జీతాలు, అలవెన్స్‌లు, సచివాలయ నిర్వహణకు, రూ.98.84 కోట్లను సభ్యులకు కేటాయించారు. లోక్‌సభ విషయానికొస్తే 1.56 కోట్లను స్పీకర్, డిప్యూటీ స్పీకర్ల జీతాలు, అలవెన్స్‌ల కోసం కేటాయించారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలం

10న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ వీరయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నదని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య విమర్శించారు. ఈ బడ్జెట్ కేటాయింపులను తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేసేందుకు ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ ధర్నాలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని కోరారు. నిరుటి కంటే ఈసారి బడ్జెట్ పరిమాణం దాదాపు రూ.3 లక్షల కోట్లు పెరిగినప్పటికీ ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతంగా చూపడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్మికులు, కర్షకులకు అన్యాయం

కేంద్ర బడ్జెట్‌పై ప్రజాసంఘాల నేతల ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పనకు, కార్మికుల భద్రతకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోవడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు విమర్శించారు. ఆదివారం వారు హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 10 ఏండ్ల తర్వాత కూడా విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పిన నరేంద్ర మోదీ సర్కారు అందుకు తగ్గట్టుగా బడ్జెట్‌లో కేటాయింపులు జరపకుండా రైతాంగాన్ని మరోసారి మోసగించిందని, రైతు రుణమాఫీ, ధరల స్థిరీకరణ, ఉపాధి హామీ పథకాలకు నిధులు పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనాభా నియంత్రణే శాపమా?

- ఉత్తరాది రాష్ట్రాలకు పెరిగిన కేంద్ర పన్నుల్లో వాటా శాతం
- స్థిరంగా జనాభా ఉన్న తెలంగాణకు తగ్గుదల
- ఇప్పటివరకు రాష్ట్రానికి 18,000 కోట్ల మేరకు నష్టం
- వచ్చేఏడాది మరో 4,500 కోట్లు తగ్గు చాన్స్
- దక్షిణాదిలో ఇతర రాష్ట్రాలకూ తీరని నష్టం

పన్నుల పంపిణీకి ఆరు ప్రమాణాలు ఇవే

15%	రాష్ట్రాల విస్తీర్ణం
15%	జనాభా
45%	అత్యల్ప తలసరి ఆదాయం
10%	అటవీ, పర్యావరణం
2.5%	పన్ను వసూలులో సామర్థ్యం
12.5%	జనాభా నియంత్రణలో పనితీరు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): జనాభా నియంత్రణే దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారింది. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు అధిక మేలు దక్కుతున్నది. దీంతో కేంద్ర పన్నుల్లో తీవ్ర వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కానవస్తున్నది. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా దక్కడమే లేదు. ఉత్తరాది రాష్ట్రమైన బీహార్ వివిధ పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి ఇస్తున్నదనుకొంటే, దానికి ప్రతిగా కేంద్రం రూ.7.26 తిరిగి చెల్లిస్తున్నది. అదే రూపాయి ఇస్తున్న తెలంగాణకు కేవలం 0.47 పైసలనే కేంద్రం విదిలిస్తున్నది. ఒక్క తెలంగాణకే కాదు.. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ విషయంలోనూ ఇలాంటి అన్యాయమే జరుగుతున్నది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా నిర్దేశించే సమయంలో జనాభాను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో జనాభాను నియంత్రిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతున్నదని ఆర్థిక నిపుణులే చెప్తున్నారు.

తెలంగాణకు ఏటా 4,500 కోట్ల నష్టం

14వ ఆర్థిక సంఘం (2015-2020) తెలంగాణకు కేంద్ర పన్ను ఆదాయం విభజనలో 2.437% వాటాను కట్టబెట్టింది. 15వ ఆర్థిక సంఘం (2021-2026) 2011 నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడంతో తెలంగాణ వాటా 2.102 శాతానికి తగ్గింది. అంటే కేంద్ర పన్నుల్లో వచ్చే వాటాలో 0.335% కోత పడింది. ఫలితంగా తెలంగాణకు ఏటా రూ.4,500 కోట్ల నష్టం కలుగుతున్నట్టు ఆర్థిక నిపుణులు తేల్చి చెప్తున్నారు. నాలుగేండ్లలో తెలంగాణ రాష్ట్రానికి సుమారు రూ.18,000 కోట్ల జరిగింది. వచ్చే ఏడాది మరో రూ.4,500 కోట్ల నష్టం జరగనున్నది.

నిధుల కేటాయింపులు ఇలా..

రాష్ట్రాల నుంచి సీజీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో కేంద్రానికి నిధులు వెళ్తాయి. ఈ నిధుల్లో నుంచి కేంద్రం రాష్ట్రాలకు వాటా పంచుతుంది. ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను పంచుకుంటాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సిఫారసులు (2021-2026) అమలులో ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం ఉన్నంతవరకు కేంద్ర పన్నుల్లో 42% వాటా రాష్ట్రాలకు పంపిణీ అయ్యేది. 15వ కమిషన్ సిఫారసుల్లో ఈ వాటాను 41 శాతానికి తగ్గించారు.

అత్యల్ప తలసరి ఆదాయ రాష్ట్రాలకు 60%

70వ దశకం మధ్యలో జనాభా నియంత్రణ చర్యలను కేంద్రం తీవ్రతరం చేసింది. జనసాలను నియంత్రించే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దాంతో దక్షిణాదిన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు జనాభా నియంత్రణ చేపట్టాయి. కానీ, ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరగలేదు. ఉత్తరాదిన జన విస్ఫోటనం పెరిగింది. పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలు తదితర అభివృద్ధి పనులు దక్షిణాదిన ఊపందుకొని ప్రజల తలసరి ఆదాయం పెరిగితే, ప్రభుత్వాల వైఫల్యం కారణంగా యూపీ, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరుగలేదు. జనాభాలో 19% వాటా కూడా లేని దక్షిణాది రాష్ట్రాలు.. ప్రస్తుతం జీడీపీలో 32% వాటాను కలిగి ఉన్నాయి. 1976 తర్వాత ఏర్పాటైన ఫైనాన్స్ కమిషన్లు (10వ ఫైనాన్స్ కమిషన్ నుంచి) 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకొన్నాయి. దాంతో కేంద్ర రాబడి వాటాల్లో దక్షిణాదికి కొంత మేర న్యాయం జరిగింది. 15వ ఆర్థిక సంఘం 2011 నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్నది. అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలకు 60% మేర ప్రాధాన్యం ఇచ్చారు. దాంతో జనాభా నియంత్రణ పాటించి, పౌరుల తలసరి ఆదాయాన్ని పెంచిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటాల్లో అన్యాయం జరుగుతున్నది.

కొనుగోలు శక్తిని హరించే బడ్జెట్

సీఐటీయూ, గిరిజన సంఘాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం, ఆహార ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తదితర సమస్యలను పరిష్కరించేలా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించకపోవడం ప్రజల కొనుగోలు శక్తి క్షీణతకు దారితీస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ తాజా బడ్జెట్‌లో 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రకటించినా పాత విధానంలో మార్పులను ప్రస్తావించకపోవడం నష్టదాయకమేనని స్పష్టం చేశారు.

విద్యుత్తు సంస్కరణలు హానికరం

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు చేటు

డీవైఎఫ్ఐ, ఆదివాసీ, గిరిజన సంఘాల ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగంలో సంస్కరణల కోసం కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హాని జరుగుతుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర నేతలు అనగంటి వెంకటేశ్, డీజీ నరసింహారావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సుంద ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వారు హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుంచి 100 శాతానికి దేశీయ బీమా సంస్థలను బలహీనపర్చడమేనని విమర్శించారు. ఆర్థిక సంస్కరణలను అమలు చేసే రాష్ట్రాలకే సహకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ధ్వజమెత్తారు. అణు ఇంధన సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించడంతోపాటు ఖనిజ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు మోదీ సర్కారు బరితెగించిందని నిప్పులు చెరిగారు.

ఆర్టీసీలో మరో యూనియన్ సమ్మె బాట

7న ఎండీకి తెలంగాణ మజ్దూర్ యూనియన్ నోటీస్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో మరో కార్మిక యూనియన్ సమ్మెకు సిద్ధమైంది. టీజీఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి డేటాఫ్ అపాయింట్‌మెంట్ ప్రకటించాలని, ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, వేతన సవరణతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్లతో ఈ నెల 7న సంస్థ ఎండీకి సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కే హనుమంతు ముదిరాజ్ ఆదివారం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని డిపోల కార్మికులు హాజరుకావలని విజ్ఞప్తి చేశారు.

మంచిర్యాల జిల్లా కన్నాలలో పెద్దపులి అడుగు జాడలు

కన్నాలలో పెద్దపులి, ఇర్కపల్లిలో చిరుతపులి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2 : మంచిర్యాల జిల్లా కన్నాల అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 4 రోజులుగా బుగ్గగూడెం, లక్ష్మీపురం, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం సమీప ప్రాంతాల్లో పులి సంచరిస్తుండడంతో ప్రజలు సాయంత్రం కాగానే ఇంట్లో నుంచి బయటకు వెళ్లడంలేదు. అటవీ అధికారులు శనివారం రాత్రి కన్నాల అటవీ ప్రాంత రహదారిని మూసివేశారు. ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా కన్నాల శివారులో పెద్దపులి అడుగులను గుర్తించారు. నాలుగు రోజులుగా ఒకే ప్రాంతంలో సంచరిస్తుండడంతో వేటగాళ్ల నుంచి పులికి రక్షణ కల్పించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో పులి తిరుగుతుండడంతో భక్తులు అటు వెపు వెళ్లడంలేదు. అర్చకులు గుడికి తాళం వేసి వెళ్లిపోయారు.



ఆసిఫాబాద్ జిల్లా ఇర్కపల్లిలో చిరుతపులి పాదముద్రలు

చిరుత సంచారం

తిర్యాణి, ఫిబ్రవరి 2: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇర్కపల్లిలో చిరుతపులి సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం రాత్రి చింతపల్లి ప్రాంతంలో చిరుత చెట్టు ఎక్కిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తిర్యాణి ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకపుగూడ, ఇర్కపల్లి, చింతపల్లి, సమీప గ్రామాల్లో గాలింపు చేపట్టారు. సమీపంలోని గురుకుల పాఠశాలకు 2 కిలోమీటర్ల దూరంలో చిరుత పాదముద్రలు గుర్తించారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాబాయ్, అబ్బాయ్.. కన్నుపడితే 'క్రష్'

▸ మొదటిపేజీ తరువాయి...

ఉండాలని వ్యాపారులు కోటి దేవుళ్లను మొక్కుకుంటున్నారు. ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని బాధపడుతున్న స్టోన్ క్రషర్లు, ఇసుక క్వారీల యజమానులపై బాబాయ్- అబ్బాయ్ పిడుగుల్లా పడ్డారు. ప్రణాళిక ప్రకారం గనులను వీరు చేజిక్కించుకుంటున్నారు. గని ఉన్నదని తెలియగానే దాన్ని వదులుకోవాలని బెదిరించడం, లేదా వాటా అయినా ఇవ్వాలని హుకుం జారీ చేయడం, దిగిరాకుంటే అధికారులతో దాడులు చేయించడం కొన్ని నెలలుగా వారికి పరిపాటైంది.

సూత్రధారి ముఖ్యనేత అక్క అల్లుడే

గనులను చెరబడుతున్న వ్యవహారంలో రాష్ట్రంలో అత్యంత ముఖ్యనేత అక్క అల్లుడే సూత్రధారిగా నిలిచాడు. ఆయన కనుసన్నల్లోనే రాష్ట్ర గనులు, భూగర్భశాఖలోని కొందరు కీలక అధికారులు పనిచేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. అధికారుల అండ కూడా తోడవ్వడం, రాష్ట్ర స్థాయి ముఖ్యనేత తనకు అత్యంత సమీప బంధువు కావడంతో ఇప్పుడు ముఖ్యనేతకు అక్క అల్లుడు రెచ్చిపోతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని స్టోన్ క్రషర్లు, ఇసుక క్వారీల వివరాలు తీసుకొని వాటన్నింటిని తన దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం మొదలుపెట్టాడు. నగరం చుట్టూ సగం స్టోన్‌క్రషర్లను తన దారికి తెచ్చుకున్నట్టు సమాచారం. మరి కొన్నింటిపై వీపరీతమైన ఒత్తిడి పెట్టినట్టు తెలుస్తున్నది. వీటన్నింటినీ తమ బినామీల పేర్ల పైకి మార్చేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

సలహాదారుడూ తక్కువ తినలే..

రాష్ట్ర ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్న సలహాదారుడు షామీర్‌పేట సమీపంలోని ఓ గ్రామంలో ఒక క్వారీ తీసుకున్నాడు. వాస్తవానికి ఆ ప్రాంతంలో తవ్వకాలను నిషేధించారు. ఆ గ్రామాన్ని తవ్వకాల నిషేధిత జాబితాలో పెట్టారు. కానీ ప్రభుత్వంలోని కీలక సలహాదారుడి కోసం అక్కడ నిబంధనలను సడలించారు. పర్యావరణానికి ఇబ్బందికరమని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ముఖ్యనేత దారిలోనే అనుచరులు

రాష్ట్రంలోని ముఖ్యనేత దారిలోనే అనుచరులు కూడా నడుస్తున్నారు. ఓ మంత్రి అన్న కొడుకు ఇప్పుడు ఉత్తర తెలంగాణలోని రెండు ఇసుక క్వారీలను చెరబట్టాడు. కనీసం పెట్టుబడి ఇవ్వాలని వేడుకున్నా ఇచ్చేది లేదని తేల్చి చెప్పి మరీ వాటిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నెలనెల ఏమైనా మిగిలితే మేమే పంపిస్తామని, మీరు దందా చేయవద్దని చెప్పినట్టు తెల్సింది. మానకొండూరు, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని ఇసుక ర్యాంపుల్లో ఇప్పుడు అన్న కొడుకు హవా నడుస్తున్నది. ఇక మహబూబ్‌నగర్‌లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఓ ఎమ్మెల్యే కథ కూడా బయటకు వచ్చింది. ఆయన తన నియోజకవర్గంలో ఉన్న ఓ క్రషర్ యజమానిని పిలిచి నెలకు ఎంతో కొంత తనకు పంపాలని, ఎమ్మెల్యే అయ్యా కదా ఖర్చులున్నాయని చెప్పాడు. ఎమ్మెల్యే చెప్పినంత ఇచ్చుకోలేనని, మాట్లాడుకుందామని యజమాని చెప్పడంతో నెల తిరక్కముందే ఆ క్రషర్ తనదేనని ఎమ్మెల్యే ప్రకటించేసుకున్నాడు. ఇదేం పద్ధతి అని ఆ వ్యాపారి అడిగితే వెంటనే గనుల శాఖ అధికారులు రంగంలోకి దిగి భారీ జరిమానాలు వేశారు. దీంతో ఇక చేసేది లేక ఆ ఎమ్మెల్యే చెప్పిన వాళ్లకు క్రషర్‌ను అప్పగించేశాడు.

ఇవీ ఉదాహరణలు

- శంషాబాద్ సమీపంలోని మామిడిపల్లి సమీపంలో ఒకరికి స్టోన్‌క్రషర్ అనుమతి వచ్చింది. అక్కడ ఉన్న క్రషర్‌పై ముఖ్యనేత దృష్టిపడింది. వెంటనే తన అన్నను రంగంలోకి దించాడు. ఆ అన్న బెదిరింపులు మొదలుపెట్టాడు. చివరికి అధికారులను రంగంలోకి దించి ఆ వ్యాపారిని ముప్పుతిప్పలు పెట్టారు. దీంతో ఆయన వీళ్లు చెప్పినట్టు సంతకాలు చేశారు. ఉత్తపుణ్యానికే సగానికిపైగా వాటా రాయించుకున్నారు. క్రషర్‌కు రూపాయి పెట్టుబడి పెట్టకుండా సగానికి పైగా వాటా రాయించుకోవడం అంటే వీళ్ల దౌర్జన్యం ఏ స్థాయిలో ఉన్నదో ఊహించుకోవచ్చు.
- లకుడారం వద్ద మరో వ్యాపారికి సంబంధించిన గనిని కూడా హస్తగతం చేసుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో రెండు క్రషర్లు ఏర్పాటు చేశారు. వీటిని కడప జిల్లాకు చెందిన ఓ సంస్థకు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా వీళ్లు అడ్డగోలుగా క్రషర్లు నడుపుతున్నారు. అయినా వీటి వంక గనుల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఇక్కడ గతంలో ఆ క్రషర్లను నడిపిన వారిని భయభ్రాంతులకు గురి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇదేమని అడిగేవారే లేరు.
- దౌల్తాబాద్ మండలంలోని ఓ గని యజమాని తాను ఇవ్వలేనని, తనకు అప్పులున్నాయని, ఈసారికి వదిలిపెట్టాలని అడిగితే వదలకపోగా విద్యుత్తు అధికారులకు చెప్పి కరెంటు సరఫరా నిలిపివేయించారు. కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ఆ వ్యాపారి అన్నీ వదిలిపెట్టేశాడు. ఇప్పుడు ఇది రాష్ట్ర ముఖ్యనేత అక్క అల్లుడి స్వాధీనంలో ఉన్నది.

500 టీపీహెచ్ క్రషర్‌కు సన్నాహాలు

నగరంలోని ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని విమానాశ్రయానికి వెళ్లేదారిలో ఉన్న అత్యంత ఖరీదైన ప్రభుత్వ స్థలంలో 500 టీపీహెచ్ (గంటకు 500 టన్నుల సామర్థ్యం) ఉన్న క్రషర్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. దీనికోసం ప్రభుత్వానికి చెందిన 16 ఎకరాల భూమిని తీసుకున్నారు. ఇక్కడ పెద్దపెద్ద బండలను తీసుకొచ్చి కొట్టి నిర్మాణాలకు సరఫరా చేసేందుకు అనుగుణంగా ప్లాంట్‌ను నెలకొల్పుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 500 టీపీహెచ్ కెపాసిటీ ఉన్న క్రషర్లు లేవు. ముఖ్యనేత సొంత అన్న పర్యవేక్షణలో అక్క అల్లుడి సారథ్యంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. అత్యంత ఖరీదైన 16 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి 30 ఏళ్ల లీజుకు రాయించుకుంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న క్రషర్‌కు నిరంతరం గిరాకీ ఉండాలన్న ఉద్దేశంతో చుట్టుపక్కల ఉన్న చిన్నచిన్న క్రషర్లన్నింటినీ ఏదో ఒకసాకుతో మూయించేస్తున్నారు. ఒక్కొక్కరిపై మోయలేనంత జరిమానాలు విధిస్తున్నారు. ఓ హేతుబద్ధత అంటూ లేకుండా జరిమానాలు విధించడంపై యజమానులు రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి మొరపెట్టుకుంటున్నారు.

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఎదురుకాల్పులు!

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 2 : ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ -నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో మాడ్ ఏరియా కమిటీ మావోయిస్టులు సమావేశమయ్యారనే సమాచారంతో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆదివారం కోయిలాబేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పానీదోబిర్ అడవుల్లో భద్రతాదళాలపై మావోయిస్టులు కాల్పులు జరపగా, జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. కాల్పులు కొనసాగుతున్నట్టు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం వెల్లడించారు. ఈ ఘటనలో ఎంతమంది మృతిచెందారనే విషయంపై పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

మావోయిస్టుల కుట్ర భగ్నం..

భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను జవాన్లు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సీతాపూర్-ఉసుర్ మార్గంమధ్యలో రోడ్డుని తవ్వి మావోయిస్టులు మందుపాతరలు అమర్చారు. భద్రతాదళాలు గుర్తించి 25కేజీల కంటైనర్‌లో పాతిపెట్టిన ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ)ని తొలగించారు. ఈ మందుపాతరకు కార్డెక్స్ వైర్‌ను అనుసంధానం చేస్తూ రోడ్డు నుంచి 400మీటర్ల వరకు అమర్చారు. రోడ్డు గుంతలా ఉండడంతో వైరుని గమనించిన జవాన్లు మందుపాతరను జేసీబీతో తవ్వించి, నిర్వీర్యం చేశారు.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో 2 నుంచి 6 డిగ్రీల పెరుగుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పగటి ఉష్ణోగ్రతలు ఘననీయంగా పెరిగాయి. అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. 2 నుంచి 6 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదిలాబాద్ జిల్లాలో 36.5, భద్రాద్రి-కొత్తగూడెం 35.6, హనుమకొండ, హైదరాబాద్ 34, ఖమ్మం 34.6, మహబూబ్‌నగర్ 36.1, మెదక్ 34.8, నల్లగొండ 31.5, నిజామాబాద్ 34.5, రామగుండంలో 34 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే వారం రోజులు వాతావరణం ఇలేగా ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, పసిఫిక్ మహా సముద్రం పరిసరాల్లో లీనినా తరహా వాతావరణం ఏర్పడిందని, దీంతో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు.

మోస్ట్ వాంటెడ్ బత్తుల ప్రభాకర్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న మూడు దేశవాళీ పిస్తోళ్లు, 451 రౌండ్ల బుల్లెట్లు, ఇతర సామగ్రి

4 రాష్ట్రాలు.. 80కిపైగా కేసులు

- 28 కేసుల్లో మోస్ట్‌వాంటెడ్
- దోచుకున్న సొత్తుతో జల్సాలు
- ప్రిజం కాల్పుల నిందితుడి లీలలు
- 3 గన్‌లు, 451 బుల్లెట్లు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 2: ప్రిజం పబ్ కాల్పుల ఘటనలో 4 రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న బత్తుల ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో సైబరాబాద్ క్రైం డీసీపీ నర్సింహులుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు.

ఇండ్లలో చోరీలతో ప్రారంభించి

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, సోమలధరి మండలం, వడ్డెపల్లి ఇరికిపెంట గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్ అలియాస్ ప్రభాకర్‌రావు 2013లో తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలతో నేర వృత్తిని ప్రారంభించి, పేరొందిన ఇంజినీరింగ్ కళాశాలల్లో చోరీలకు పాల్పడే స్థాయికి చేరుకున్నాడు. చోరీ సొత్తుతో ఖరీదైన పబ్బులు, జిమ్‌లు, హోటళ్లకు తరచూ వెళుతూ విలాసవంతమైన జీవితానికి అలవాడుపడ్డాడు. 2020లో విశాఖపట్నం జిల్లాలో 57 చోరీ కేసుల్లో నిందితుడిగా అరెస్టయి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు సైతం వెళ్లాడు. 2022లో జైలు నుంచి తప్పించుకుని, నేరాలు కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు 4 రాష్ట్రాల్లో 80కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉండి 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. కొన్ని నెలలుగా గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని ఓ అపార్టుమెంట్‌లో స్నేహితుడి పేరుతో అద్దెకు తీసుకుని ఉంటున్న బత్తుల ప్రభాకర్‌పై నిఘాపెట్టిన మాదాపూర్ సీసీఎస్ పోలీసులు శనివారం ప్రిజం పబ్ దగ్గర అతడి కోసం కాపుకాసి పట్టుకునే ప్రయత్నించగా అతడు పోలీసుల పైకి 2 రౌండ్లు కాల్పులు జరిపాడు. సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి ఎడమ కాలికి గాయమైంది. నిందితుడిని అదుపులోకి తీసుకుని, 2 దేశవాళీ గన్‌లు, 23 రౌండ్ల బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభాకర్ ఇంట్లో సోదాలు నిర్వహించిన మరో దేశవాళీ గన్, 451 రౌండ్ల బుల్లెట్లు, 3 సెల్‌ఫోన్లు, రూ. 62,000 నగదు, ఓ ఎలక్ట్రికల్ రాడ్‌కట్టర్, ఓ ఐరన్ రాడ్, ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షన్ బాక్సు, కటింగ్ బ్లేడ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

జైలులో శత్రుత్వం.. హత్యకు కుట్ర

విశాఖ సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు తోటి ఖైదీకి ప్రభాకర్‌కు మధ్య వైరం ఏర్పడింది. జైలు నుంచి తప్పించుకొని ఆ ఖైదీ విడుదలయ్యాక చంపాలని ప్రభాకర్ భావించాడు. బిహార్ నుంచి గన్‌లు, బుల్లెట్లు కొనుగోలు చేశాడని డీసీపీ వినీత్ తెలిరు. ప్రభాకర్‌ను పట్టుకున్న మాదాపూర్ సీసీఎస్ పోలీసులు వెంకట్‌రెడ్డి, ప్రదీప్, వీరస్వామికి రివార్డులు అందజేసినట్టు వెల్లడించారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, క్రైం డీసీపీ శశాంక్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబ్ , డీఐ రాజేశ్ పాటు పలువురు సమావేశంలో పాల్గొన్నారు.

విలేకరుల ముసుగులో వసూళ్లు

మిర్యాలగూడ సీఐని బెదిరించిన ఇద్దరి అరెస్ట్ • వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 2: విలేకరుల ముసుగులో ప్రభుత్వ అధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్ ఎడిటర్ అని చెప్పుకుంటున్న ఆనంద్‌కుమార్, తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీఐ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని నెల రోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సదరు సీఐ ఆ ముగ్గురిని సంప్రదించి కథనాలు ఆపాలని కోరగా రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. సీఐ స్నేహితుడు ఆంజనేయులు కలిసి రూ.1.10 లక్షలు ఇచ్చాడు. మళ్లీ డబ్బులు కావాలని సీఐని బెదిరించడంతో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో ఇద్దరిని అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు